చలపాక ప్రకాష్



# ఆసరా

"మీతోనే అండీ నేను మాట్లాడుతుంది. మీకు ఇద్దరబ్బాయిలుంటే లేరని అబద్ధాలు చెబుతారేంటీ? ఈ పవిత్ర స్థలంలో ఇలాంటి అసత్యాలు చెప్పేవారికి ఎటువంటి స్థానం లేదు".

అది ఊరి చివరి ప్రాంతం. విశాలమైన మైదానంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో వుంది ఓ పెద్ద భవనం. దాని పేరు 'అమ్మ' వృద్ధాశ్రమం.

ఆ భవనం ముందుకు వచ్చి ఆగింది ఓ ఆటో. అందులోనుంచి దిగారు రమణ, సత్యనారాయణలు. మూడు పదులు వయస్సు దాటిన రమణ ఓ దినపత్రికలో విలేఖరిగా పనిచేస్తూ ఖాళీ సమయంలో సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనటం అతని జీవితాశయంలో ఓ భాగం. ఇక సత్యనారాయణకు దాదాపు డెబ్బై సంవత్సరాలుంటాయి. సన్నగా బక్కపల్చగా వుండి వయస్సు మీరటంతో అనుకుంట, ఒళ్ళు చిన్నగా ఒణుకుతున్నట్లుగా కనిపిస్తాడు.

ఇద్దరూ ఆటో దిగి 'అమ్మ' వృద్ధాశ్రమంలోని డైరెక్టరున్న ఆఫీస్ రూంలోకి ఎంటరయ్యారు. వీళ్ళను చూసిన ఆశ్రమ డైరెక్టర్ సంధ్య కుర్చీలోనుండి లేచి నుంచుంది మర్యాద పూర్వకంగా.

"మీకు ఫోనులో చెప్పాను చూడండి సంధ్యగారూ! వారే వీరు" పరిచయం చేసాడు రమణ.

సత్యనారాయణకు అభిమాన పూర్వకంగా నమస్కరించింది సంధ్య. ఆయన ప్రతి నమస్కారం చేసాడు ఒణుకుతూనే. తాము అక్కడికి రావడానికి గల కారణం ఏమిటో ముందుగానే ఫోనులో రమణ సంధ్యకు చెప్పడంతో, పరిచయాలనంతరం బీరువాలోనుండి ఓ ఫైల్‌లోనుండి ఫారం తీసింది సంధ్య.

"మీకు పిల్లలు లేరని రమణ చెప్పారు! ఇప్పటివరకు మీరు ఎక్కడున్నారు?" ప్రశ్నించింది సంధ్య.

"విజయవాడలో దూరపు చుట్టాలుంటే, వారింట్లోనే వుంటూ ఏదోక పనిచేసుకొని పొట్టపోసుకునే వాడిని. కాని ఈమధ్య పనిచేసే సత్తువ లేకపోవటంతో వాళ్ళకి భారం కాకూడదనే ఇక్కడ ఆశ్రయం పొందడానికొచ్చానమ్మా" చెప్పాడు సత్యనారాయణ ఒణుకుతున్న స్వరంతో.

"అలాగా!... సరే... మా ఆశ్రమ రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ ప్రకారం ఈ ఫారం పూర్తిచెయ్యాలి. మీ వివరాలు చెప్పండి" అడిగింది సంధ్య.

"చెప్పా కదమ్మా. నాకెవరూ లేరని, విజయవాడలో వుంటున్నానని" విసుగు ప్రదర్శించే ధోరణిలో చెప్పాడు సత్యనారాయణ. ఆ వయస్సులో ఆ విధమైన విసుగు కలగటం సహజమనుకుంట.

"ఆ వివరాలు కాదు. నేను ఒకొక్కటే అడుగుతాను. ఆ ప్రకారం చెప్పండి" అంది సంధ్య ఓర్పుగా.

"మీ పేరు?"

"సత్యనారాయణ".

"ఇంటి పేరుతో సహా పూర్తిగా చెప్పాలి?"

"గూనాకుల సత్యనారాయణ".

"గూనాకుల సత్యనారాయణా?" ఆశ్చర్యంగా ప్రశ్నించింది సంధ్య. ఆ ఇంటి పేరు వినగానే ఆమె మొఖంలో రంగులు మారాయి. "మీరు విజయవాడలో రామరాజ్యపేటలో వుండేవారు కదూ" అంది మళ్ళీ తనే.

"అవునమ్మా!" ఈసారి ఆశ్చర్యపోవటం సత్యనారాయణ వంతైంది.

"మీ భార్య పేరు సరోజమ్మకదూ".

"అవునమ్మా, మీకెలా తెల్సు?" తాము చెప్పకుండానే ఆమె తన భార్య పేరు చెప్పగానే మరింత ఆశ్చర్యపోయాడు. బహుశ ఆ పేటలో వుండి వుంటుంది ఆ అమ్మాయి అనుకున్నాడు సత్యనారాయణ.

"మీ భార్య సరోజమ్మ అయితే, మీకు పిల్లలు లేకపోవడమేమిటీ...? మీకు ఇద్దరు మగ పిల్లలున్నారు కదా?" అడిగింది సంధ్య.

"అబ్బే! లేరమ్మా. వుంటే ఇక్కడకెందుకొస్తాను" బుకాయించడానికి ప్రయత్నించాడాయన. ఎందుకంటే తనకు మగ పిల్లలున్నారని తెలిస్తే ఆ ఆశ్రమంలో తనని చేర్చుకోకూడదు- ఆశ్రమ నియమ నిబంధనల ప్రకారం, అదీ అతని భయానికి కారణం.

"మీరు అబద్ధం చెబుతున్నారు! మీకు రాధాకృష్ణ, శ్రీనివాస్ అనే ఇద్దరబ్బాయిలున్నారు. మీ పెద్దబ్బాయి మిమ్మల్ని ఒదిలేసి బందరులో వుంటున్నాడు. రెండవతను మీ ఊర్లో మీ పేటలోనే వుంటున్నాడు" కోపంగా చెప్పుకుపోతుంది సంధ్య. ఆమె చెప్పింది నిజమే. కాని తన గురించి అన్ని వివరాలు ఆమె ఎలా చెప్పగలుగుతుంది? కనీసం రమణక్కూడా తన వాళ్ళ గురించి వివరాలు పూర్తిగా తెలియవే. మరి ఎలా తెల్సుకోగలిగిందీ అమ్మాయి?" ఆలోచనలో పడ్డాడు సత్యనారాయణ.

"మీతోనే అండీ నేను మాట్లాడుతుంది. మీకు ఇద్దరబ్బాయిలుంటే లేరని అబద్ధాలు చెబుతారేంటీ? ఈ పవిత్ర స్థలంలో ఇలాంటి అసత్యాలు చెప్పేవారికి ఎటువంటి స్థానం లేదు" కోపంగా ఊగిపోయింది సంధ్య. అప్పటివరకు సున్నితంగా వున్న ఆమె కంఠస్వరం ఒక్కసారిగా కరుకుతనంగా మారేసరికి సత్యనారాయణలో ముచ్చెమటలు పోసాయి. అక్కడ వున్న రమణకి ఇదంతా అర్థంకాక అయోమయ పరిస్థితుల్లో వున్నాడు. పాపం సత్యనారాయణకు ఎవరూ లేరంటే జాలిపడి ఈ ఆశ్రమంలో ఆశ్రయం కల్పించడానికని తీసుకొచ్చాడు తాను. తీరా ఈయన గురించి వివరాలు తెల్సుకుంటుంటే, తనకి తెల్పినవన్నీ అబద్ధాలని, తాను ఆయనతో కుమ్మక్కై తప్పుడు సమాచారంతో ఇక్కడ చేర్చడానికి తీసుకొచ్చినట్లు సంధ్య తనని తప్పుగా భావిస్తుందని అవమానంగా ఫీలవ్వసాగాడు రమణ.

"అది కాదమ్మా? మరీ...మరీ... " నసిగాడు సత్యనారాయణ సంజాయిషీ చెప్పుకోలేక.

"ఇంకేం మీరు చెప్పొద్దు! మీ పట్టింపులు, పంతాలు నెరవేరాలని భీష్మించుకు కూర్చొని బ్రతికున్నంతవరకూ మీ భార్యని వేధించుకుని

